# 10

# "సంఘము" అనగానేమి?

దీర్ఘకాల ప్రవాసానికి గాను ఒక పరాయి దేశానికి సంస్కృతికి చెందిన మనిషి అమెరికాకు ప్రయాణం చేయాలనుకున్నాడు. కష్టపడి ఇంగ్లీషు నేర్చుకొని, తన ప్రయాణానికి సంసిద్ధమైయున్నట్టు అతడు తలచాడు. దీర్ఘకాలం వేచియున్న అతని అమెరికా పయనం సాగింది, తాను ఆ దేశం వెళ్లిన తరువాత, అతడు నేర్చుకున్న ఇంగ్లీషుకు పరీక్ష పెట్టబడింది. ఆయా వస్తువులు కొనడానికి యింటి సామానులకు సంబంధించిన కొట్టుకు అతడు వెళ్లాడు. డబ్బుకట్టే స్థలంలో, తాను యింకా ఎంత బాకీ పడ్డాడో చెప్పబడ్డాడు. తన జేబులో చెయ్యిపెట్టి, డబ్బు తీశాడు, సరిగానే లెక్కపెట్టి గుమస్తాకు యిచ్చాడు. తన సరకులు సంచిలో వేసికొన్నాడు. అతడు వెళ్లసాగాడు. అతడు తలుపు నొద్దకు వెళ్లేలోగా, ఆ గుమస్తా దయగా "మరొకసారి రండి!" అని చెప్పాడు. ఆ (దేశం) చూడ వచ్చినవాడు ఆగి, వెనుకకు తిరిగి మరల డబ్బు కట్టే చోటుకు వచ్చాడు. అప్పుడు ఆ గుమస్తా, "నేను సహాయం చేయనా?" అని అడిగాడు. కొంత తికమక పడుతూ, "నీవు నన్ను వెనుకకు తిరిగి రమ్మన్నావుగా?" అని ఆ మనిషి అన్నాడు.

"నీవు చేసిన వ్యాపారానికి వందనాలు; తొందరలో మేము నీకు సహాయపడేలా చూడండి" అని ఉద్దేశించిన మాటలను ఆ మనిషి అక్షరార్థంగా వ్యాఖ్యానించాడు. గుమస్తా ఉద్దేశించిన అర్థాన్ని గ్రహించక పోవడంతో లేక అపార్థం చేసికొనడంతో సమాచారం అందుకొనడంలో తప్పిపోవడమే జరిగింది.

మనలో ప్రతి ఒక్కరికి యిలాటి అనుభవం ఉంటుంది. మనతో పలికిన మాటలేవో మనకు తెలుసు, అయితే పలికిన వ్యక్తి ఆ మాటలను ఏ భావంతో పలికాడో మనం అర్థం చేసికోలేదు. మనకు మాటలు అర్థమయ్యాయి, కాని చెప్పనుద్దేశించిన భావాన్ని మనం పూర్ణంగా అందుకోలేక పోయాం.

నీవు దాన్ని ఏ విధంగా చూచినా సరే, సందేశాన్ని అందించడం కష్టమే. మాట్లాడే

వానికిని వినేవానికిని మధ్య సందేశం అందించడం పుచ్చుకొనడం జరగాలంటే చాలా సంబంధం అవసరం.

సందేశం యిచ్చి పుచ్చుకొనడం అనే ఈ విధానాన్ని బైబిలు పఠనానికి మనం వర్తింపజేద్దాం. మనకును బైబిలుకును మధ్య ప్రయోజనకరమైన సమాచారపు అందింపు జరగాలంటే, ఉపయోగింపబడిన మాటలను కేవలం వినడమే కాదు, దైవ ప్రేరేపితుడైన రచయిత ఆ మాటలను ఎన్నుకొనడంలో తాను చెప్పదలచుకున్న సందేశమేదో కూడా మనం వెదకాలి. అంటే, ఆ మాటలు లేక ఆ ప్రతిపాదన ఏ సందర్భంలో చేయబడిందో మనం గ్రహించడానికి కృషి చేయాలి. దేవుడు తన సందేశానికి ఏ భావం ఉద్దేశించాడో జాగ్రత్తగా పరిశీలించవలసినట్లు దేవునితో యథార్థంగా ఉండమనేది కోరుతుంది లేక డిమాండ్ చేస్తుంది.

"సంఘము" అనే పదం మనలో ఎక్కువ మందికి సుపరిచితమైనదే. లేఖనాల్లో ఈ పదాన్ని గూర్చి దేవుడు విస్తరించి మనతో మాట్లాడతాడు. ఈ మాట విషయంలో దేవునికిని మనకు మధ్య సరిగా సమాచారం అందింపబడాలంటే, మనం బైబిలు ప్రపంచంలోనికి వెళ్లి, పదం యొక్క అర్థాలు, ఉదాహరణలు, ప్రభువైన యేసును, ఆయన అపొస్తలులును, మరి యితర దైవప్రేరేపితులైన మనుష్యులు అంటే, దేవుని ఆత్మ ద్వారా బైబిలును వ్రాసినవారు – ఆలోచనా రూపాలను ఎలా ఉపయోగించారో చూడవలసియుంటుంది.

"సంఘము" అనగానేమి? ఆయా సందర్భాలలో క్రొత్త నిబంధన ఈ పదాన్ని 114 సార్లు[1] వినియోగించగా, దాని ఇరవై ఏడు పుస్తకాలలోని[2] పదిహేడింటిలో మనకు అందించబడుతున్న సమాచారమేమి? ప్రభువైన యేసు సంఘాన్ని స్థాపించి నప్పుడు ఆయన నిర్మించినదేమి?

## ఆత్మ సంబంధమైన ఒక శరీరం

సంఘము ఆత్మ సంబంధమైన ఒక శరీరమని, అది నిజంగా క్రీస్తు ప్రభువు యొక్క ఆత్మ సంబంధమైన శరీరమని మనం మొదటిగా గుర్తించాలి. సంఘాన్ని ఇంగ్లీషులో "చర్చ్" అంటారు, చర్చ్ అనగానే సాధారణంగా జనుల మనస్సుల్లోనికి వచ్చే చిత్రం – ఆరాధన జరిగించే ఒక భౌతికమైన కట్టడమే. ఈలాటి భావాన్ని తెలియజేయడానికి క్రొత్త నిబంధనలో ఆ పదం ఎన్నడూ ఉపయోగింపబడలేదు.

లేఖనాల్లో, "సంఘము" అనే పదం – క్రీస్తు సువార్తకు లోబడినవారై, క్రీస్తు

రక్తముచేత విమోచింపబడినవారి కూడిక, స్థానిక, మరియు సార్వత్రిక భావాలలో వర్ణింపబడే జనుల సమూహాన్ని సూచిస్తుంది.

మొదటిగా, విమోచింపబడిన జనులు కూడిరాగా లేక దేవుని ఆరాధించడానికి కూడుకొనిన వారు “సంఘము” అని పిలువబడ్డారు. వారు కూడివచ్చునప్పుడు ఐక్యతలేమిని బట్టి అపొస్తలుడైన పౌలు కొరింథీయులను గద్దించేటప్పుడు సంఘము అనే పదాన్ని క్రైస్తవుల కూడికకు ఉపయోగించాడు. అతడిట్లన్నాడు, “...మీరు సంఘమందు కూడియున్నప్పుడు మీలో కక్షలు కలవని వినుచున్నాను ...” (1 కొరింథీ. 11:18).

తరువాత, ఒక నిర్దిష్టమైన లేక స్థానికమైన ప్రాంతంలో విమోచింపబడిన జనులను సూచించడానికి “సంఘము” అనే పదం వినియోగింపబడింది. కొరింథులో విమోచింపబడిన జనులు “కొరింథులోనున్న దేవుని సంఘము” అని పిలువబడిరి (1 కొరింథీ. 1:2ఎ).

ఆపైన, లోకమందంతటనున్న విమోచింపబడిన జనులందరిని సూచించడానికి “సంఘము” అనే పదం వాడబడింది. “క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడైయున్నాడు” అని పౌలు చెప్పినప్పుడు “సంఘము” అనే పదాన్ని అతడు సార్వత్రికమైన భావంతో ఉపయోగించాడు (ఎఫెసీ. 5:23).

“సంఘము” అనే పదాన్ని క్రొత్త నిబంధన ఉపయోగించిన తీరులో అపొస్తలుల కార్యాలలోని ఒక ప్రత్యేకమైన సంఘటనకు వర్తింపజేద్దాం. పెంతెకొస్తు దినాన (అపొ. 2:1-4) యెరూషలేములో పరిశుద్ధాత్మ కుమ్మరింపువలన జరిగిన బహిరంగ సూచనలవలన ఏమి జరుగుతుందో చూడాలని స్థానికులును, దర్శనానికి వచ్చిన వారును అపొస్తలుల చుట్టు గుమికూడారు. ఆ జనసమూహానికి పేతురు ప్రసంగించుతూ, యేసు ప్రభువుగాను, క్రీస్తుగాను అయ్యున్నట్టు వారిని ఒప్పించాడు (అపొ. 2:36). ఆత్మయందు బాధపడిన అనేకులు, “మేమేమి చేయవలెనని” అడిగారు (అపొ. 2:37బి). వారు బిగ్గరగా అడిగిన దానిలో విశ్వాసము తొంగి చూస్తున్నందున, విశ్వసించుడని పేతురు వారికి చెప్పనవసరం లేకపోయింది, వారు చేయనిదేదో అది వారికి చెప్పవలసినవాడైయున్నాడు– మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము వారిలో ప్రతి ఒక్కడు బాప్తిస్మం పొందవలెనని అతడు తెలియజేశాడు (అపొ. 2:38). రక్షణ మార్గాన్ని మూడువేలమంది సంతోషంతో అంగీకరించి, మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మం పొందారు (అపొ. 2:38, 41).

ఆ రోజు జరిగిన దానిని లూకా ఎలా వర్ణించాడో గమనించు. వారు ఏమిగా లేక ఏ విధంగా మార్పు చెందారో దానిని అతడు తొలిగా వివరించాడు (అపొ. 2:41). ప్రభువు యొక్క మాటకు లోబడినవారు ప్రభువు సంఘముగా చేయబడ్డారు. వారు సహవాసపు గుంపుగా మారిపోయారు. రెండవది, దేవుని యెడల వారికున్న ప్రవర్తన విషయంలో నూతన జీవాన్ని వారు కలిగియున్నారు (అపొ. 2:42). విమోచింపబడిన ఈ ప్రజల సమూహము దేవుని ఆరాధించుచు, అపొస్తలులనుండి దైవికమైన ఉపదేశాన్ని పొందుతున్నారు. ఒకరి యెడల ఒకరు ప్రవర్తించే వైఖరిలో నూతన అనుభవం కలిగినవారైయున్నారు (అపొ. 2:44, 45). వారు ఒకరినొకరు సహించుతూ, కలిగినవాటిని పంచుకొంటూ, శ్రద్ధచూపుతూ – ఒకరి భారములను మరొకరు భరించుతూ అవసరతలో ఉన్నవారికి అక్కరలు తీర్చుతూ, ఒకరి యెడల ఒకరు శ్రద్ధచూపుతూ ఉన్నారు. ఈ విశ్వాసుల సమూహాన్ని అపొస్తలుల కార్యాల్లో "సంఘము" అని సూచింపబడింది (అపొ. 5:11).

యెరూషలేములో విమోచింపబడినవారు దేవుని ఆరాధించడానికి కూడివచ్చి నప్పుడు, (కూడుకొనిన భావంలో) వారు "సంఘమై" యున్నారు (స్థానిక భావంలో). యెరూషలేములో విమోచింపబడిన వారినందరిని "యెరూషలేములోని సంఘము" అని సూచించవచ్చు. ఆ సంఘము ఎదిగి, విస్తరించగా, ఆ కాలములో లోకమందున్న విమోచింపబడిన వారినందరిని సూచించడానికి, "యేసు మరల వచ్చినప్పుడు, ఆయన తన సంఘమును తనతో కొనిపోవును" అంటూ (సార్వత్రికమైన రూపంలో) చెప్పవచ్చు.

## సజీవమైన సంఘటిత శరీరం

రెండవది, సంఘము అవయవములుగల శరీరంగా–సజీవమైనదిగా మనం చూడవలసిన అవసరముంది. రక్షింపబడిన జనుల గుంపును ఏదో యొక సంస్థగాను, ఒక రకమైన మానవ క్లబ్బుగాను కొందరు తలంచుతారు. దానిలో చేరవచ్చు ననుకుంటారు లేక దానికి కట్టుబడియుంటామనుకుంటారు, మరి అంతకంటె అది ఏమీ ఎక్కువ కాదనుకుంటారు.

విమోచింపబడిన జనుల సమూహంగా, సంఘము మానవ సంస్థయై యుండలేదు గాని, అది సజీవమైన అవయవములుగల శరీరమైయుంది. క్రీస్తు స్థాపించిన సంఘము దేవుని జీవముతోను, దీవెనలతోను స్పందన కలిగి జీవించునదైయుంది; అది మానవ

జ్ఞానము, నమూనా, కార్యక్రమాలతో సంపూర్ణంగా శక్తివంతం చేయబడే (లేక) బలపరచబడే మానవ నిర్మిత సభ కాదు.

కొరింథులోని సంఘమును అపొస్తలుడైన పౌలు దేవాలయమని, గుడారమని, లేక దేవుని నివాస స్థలమని వర్ణించాడు. "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?" అని అతడు 1 కొరింథీ. 3:16[3]లో అన్నాడు. తరువాత, 1 కొరింథీ. 6:19, 20లో జారత్వము ఒక వ్యక్తి యొక్క శరీరమునకు విరోధమైన పాపమని దానిని ఖండించుతూ, వ్యక్తిగతమైన క్రైస్తవుని దేవాలయముగా పౌలు చిత్రిస్తున్నాడు. 1 కొరింథీ. 3:16 సంఘాన్ని సూచిస్తుంది గాని వ్యక్తిగతమైన క్రైస్తవుని కాదు.[4] దేవుడు తన ప్రజల మధ్య నివసిస్తాడని పౌలు స్థిరపరచుతున్నాడు. ఆయన తన ప్రజలలో వ్యక్తిగతమైన వ్యక్తులలో నివసిస్తాడు (1 కొరింథీ. 6:19, 20), మొత్తంగా ఏర్పరచబడిన సముదాయం మధ్యను ఆయన నివసిస్తాడు (1 కొరింథీ. 3:16). పాత నిబంధన కాలంలో, అరణ్యంలోని గుడారం దేవుని నివాసస్థలంగా ఉండింది, అటు తరువాత అది యెరూషలేము దేవాలయంగాను రూపొందింది; కాని క్రైస్తవ యుగంలోనైతే, దేవుడు తన సంఘంలో నివసిస్తాడు, ఆయన ప్రజలలో నివసిస్తాడని పౌలు అన్నాడు.

సంఘాన్ని ఒక సజీవమైన కట్టడానికి పోల్చవచ్చు. ఎఫెసీలోని క్రైస్తవులు ఏ విధంగా రూపొందారో పౌలు ఉదహరించుతూ, వారు సజీవమైన మందిరముగా కట్టబడుతూ, నిరంతరం ఎదుగుతున్నట్టు అతడు సూచించాడు. "ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ. 2:21, 22). క్రీస్తే ముఖ్యమైన మూలరాయి యైయుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద ఆ కట్టడం కట్టబడు తున్నట్టు వర్ణించబడింది. ఆ కట్టడం యొక్క పైభాగం క్రైస్తవులతో కూడినదిగా కట్టబడుతుంది. ఆ కట్టడానికి కప్పు ఏదీలేదు, ప్రజలు సువార్తకు లోబడి వారితో చేర్చబడడంతో ఆ కట్టడం నిరంతరం పైకి లేస్తునే ఉంటుంది.

సంఘం అనేది ఒక మానవ సంస్థ కాదు – దేవుని ఆత్మకు నివాసమైయున్న ఒక సంఘటిత శరీరం. దేవుని జీవముచేత సజీవులుగా జీవిస్తున్న క్రైస్తవుల సముదాయంతో కూడినది సంఘం, వారు దేవుని ఆత్మకు నివాస స్థలమై యుంటారు. సంఘము దేవుని యొక్క భూసంబంధమైన నివాస స్థానమని నీవు చెప్పవచ్చు.

## అన్యోన్య సహవాస బాంధవ్యం

మూడవది, క్రీస్తుతో అన్యోన్య సహవాస బాంధవ్యం కలది సంఘము అని భావించవలెను. భూసంబంధమైన దృష్టిలోనుండి, ఒక సమాజపు జనులతో ప్రత్యేకమైన సంబంధ బాంధవ్యంలో ప్రవేశించడమనే మాటల్లో సంఘ సభ్యత్వాన్ని తేలిగ్గా మనం ఆలోచింపవచ్చు. ఆ జనులే సంఘంగా రూపొందుతారు. అయినా, సంఘాన్ని గూర్చిన ఈలాటి దృష్టిలో ఒక ప్రముఖమైన సత్యం లోపిస్తుంది. సంఘము ప్రముఖమైన, అన్యోన్యమైన, కొనసాగే సంబంధ బాంధవ్యంతో కూడినదై యుంటుంది; అలాటి సంబంధ బాంధవ్యం క్రీస్తుతో ఉన్న అన్యోన్య సంబంధ బాంధవ్యాన్ని కేంద్రంగా నిలుపుకుంటుంది.

ప్రభువుకు ఆయన సంఘంతో ఉన్న బాంధవ్యం ఎంత సన్నిహితమైయిందంటే, సంఘం శరీరంగాను, ఆయన శిరస్సుగాను బాంధవ్యమున్నట్టు వర్ణింపబడింది. క్రైస్తవులు శరీరము, క్రీస్తు శిరస్సై యున్నాడు. క్రీస్తు ప్రభువు యొక్క ఆత్మ సంబంధమైన శరీరంగా దేవుడు ఆయన సంఘాన్ని చేసియున్నాడు. అది నేడు అదృశ్యుడైయున్న క్రీస్తు యొక్క దృశ్యమైన భాగమైయుంది. భూమిమీద ఉన్న దినాలలో విమోచనకు సంబంధించిన తన పనిని నెరవేర్చడానికిగాను ప్రభువునకు శరీరం ఎంత నిశ్చయంగా అవసరమైయుందో తన విమోచనా కార్యం యొక్క ఫలితాన్ని ప్రతిచోటనున్న ప్రతివానికిని అందుబాటులో ఉంచడానికి అంతే నిశ్చయంగా ఆత్మ సంబంధమైన శరీరము ఆయనకు అవసరమైయుంది. గనుక, పెంతెకొస్తు దినాన, అంటే, ప్రభువు మరణానంతరం ఏభై దినాలకు, క్రీస్తు యొక్క ఆత్మ సంబంధమైన దేహాన్ని రూపొందించ డానికిగాను పరిశుద్ధాత్మ దిగివచ్చాడు. ఆనాటినుండి నేటివరకు, విమోచింపబడిన ప్రతివ్యక్తి, తాను విమోచింపబడిన సమయంలో, దేవుని అద్భుతమైన కృపనుబట్టి ఆ దేహంలో చేర్చబడతాడు.

ఈ విధంగా క్రొత్త నిబంధనలో దైవప్రేరేపితులైన లేఖకులచే సంఘము సాధారణంగా క్రీస్తు "శరీరమని" పిలువబడింది (ఎఫెసీ. 1:21-23; 5:23). క్రీస్తు యొక్క సువార్తకు విధేయులై, శిరస్సైయున్న క్రీస్తుచేతనే నడిపింప బడుతూ, భూమిమీద క్రీస్తు యొక్క శరీరంగా రూపొందుతూ, ఆత్మ సంబంధమైన ఆయన శరీరంగా వారు పని చేస్తారు. అందువలననే ఒకడు బాప్తిస్మం పొందినప్పుడు, అతడు "క్రీస్తులోనికి" బాప్తిస్మం పొందినట్టు, లేక "ఒక్క శరీరము"లోనికి బాప్తిస్మం పొందినట్టు క్రొత్త నిబంధన ప్రత్యేకంగా చెప్పుతుంది (రోమా 6:3; గలతీ. 3:27; 1 కొరింథీ. 12:13).

ఒక వ్యక్తి ఈ లోకంలో ఉన్నప్పుడే తాను ప్రవేశింపగలుగునట్లు, సంఘము

క్రీస్తుతో బహు సన్నిహితమైన బాంధవ్యం కలిగియుంది. "ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ. 1:23). క్రీస్తు సంఘము యొక్క సంపూర్ణతయై ఉన్నాడు. ఏలయనగా ఆయన ప్రజలు ఆయనయందు సంపూర్ణులైయున్నారు (కొలస్సీ. 2:10). శిరస్సైయున్న క్రీస్తు లేకుండ, శరీరంగా సంఘము అసంపూర్ణమైయుంది (ఎఫెసీ. 1:22). అదే విధంగా, శరీరమనే సంఘం లేకుండ క్రీస్తు ప్రభువు శిరస్సుగా (కొలస్సీ. 1:18) అసంపూర్ణమైయున్నాడు. సంఘమునకు శిరస్సు ఏమైయున్నాడో, ఏమి కలిగియున్నాడో, అదంతయు సంఘానికి చెందుతుంది, మరియు శిరస్సుగా, సంఘమేమై ఉందో, అది ఏమి కలిగియుందో అదంతయు క్రీస్తుకు చెందుతుంది. కనుక, ఆయన సంఘముగా, ప్రభువైన యేసుతో కొనసాగుతున్న అనుదిన అనుభవం ఒక క్రైస్తవుడు కలిగియున్నాడు. క్రీస్తులో ఉన్నవారు క్రైస్తవులమని చెప్పుకొనేవారు మాత్రము కాదుగాని; వారు క్రీస్తును కలిగినవారై యున్నారు. ఆయన శరీరమందున్న వారికి, క్రీస్తు సంపూర్ణతయొక్క ఊట తీయబడింది.

ఎఫెసీ. 5లో సంఘమును గూర్చి పౌలు చర్చించుచూ ఉండగా, భార్యభర్తల సంబంధాన్ని పోలికగా ఉపయోగించి, క్రీస్తుకు దానికిగల సంబంధాన్ని పోల్చాడు. – అక్కడ భర్తను క్రీస్తుకు పోలికగాను, సంఘాన్ని భార్యకు పోలికగాను ఉపయోగించాడు. మొదట, నియమములో, ఈ బాంధవ్యాన్ని అతడు సూచించాడు. "క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు" (ఎఫెసీ. 5:23). రెండవదిగా ఈ బాంధవ్యాన్ని ఆచరణలో లేక కార్యనిర్వహణలో సూచించాడు. భార్య ప్రతి విషయములో తన భర్తకు లోబడవలసియున్నట్టు, సంఘము కూడా క్రీస్తుకు లోబడియుండాలి. శిరస్సుగాను, నాయకునిగాను, త్రోవచూపు వానిగాను సంఘం క్రీస్తువైపు చూడాలి (ఎఫెసీ. 5:24). చివరిగా, సంకల్పంలో పౌలు ఈ బాంధవ్యాన్ని చర్చించాడు. భర్త తన భార్యను ప్రేమించునట్టు, క్రీస్తు సంఘమును ప్రేమించుచూ, తనయందున్న ఈ విశ్వాసుల సమూహాన్ని తనతో నిత్యత్వంకొరకు సిద్ధపరచుచూ ఉంటాడు (ఎఫెసీ. 5:25-27).

తన కేంద్ర స్థానంలో, క్రొత్త నిబంధన సంఘము క్రీస్తుతో బాంధవ్యం కలిగినదై యుంది. అది ప్రారంభంగా కేవలం జనులతో సంబంధం కలిగియుండడం కాదు, కాని అది వెంటనే యితర క్రైస్తవులతో బాంధవ్యంగా, ఒకే తండ్రికి తక్కిన పిల్లలు ఎలా బాంధవ్యం కలిగియుంటారో సంఘంలోని యితర సభ్యులతో అదే విధమైన బాంధవ్యంగా అది ప్రతిఫలిస్తుంది. క్రీస్తు శరీరములోని అవయవములు ఒకరికొకరు అవయవములై యున్నారు, కాని దీనంతటికంటే ప్రధానంగాను, అతి ప్రాముఖ్యంగాను,

సంఘము క్రీస్తు శరీరమైయుంది. క్రీస్తు సంఘములో సభ్యులు కావలయునంటే, క్రీస్తుతో ఒక బాంధవ్యంలో మనం ప్రవేశింపవలసియుంది. శరీరము శిరస్సునకు చెందినట్టే, ఆయనలో మనం ఒక భాగంగా, బహు సన్నిహితమైన బహు ప్రత్యేకమైన బాంధవ్యంలో ప్రవేశింపవలసి యుంటుంది.

## ముగింపు

"సంఘము" అనే పదానికి ఉన్న సరియైన భావం విషయంలో అనేకులు భ్రమపడ్డారు. అలాటి భ్రమ నిలువనవసరంలేదు, ఎందుకంటే బైబిలు దాని భావాన్ని తేటపరచింది.

"సంఘము" అనగానేమి? అది క్రీస్తు సువార్తకు లోబడినవారితో కూడినదై, ఆత్మ సంబంధమైన శరీరంగా చేయబడింది, ఆయన జనులుగా రూపొందినవారు, మరియు యివ్వబడిన సమాజంలో ఆయన ప్రజలుగా ఆరాధించుతూ పని చేస్తుండేవారు. వారు ఆయన నామాన్ని ధరించి, భూమిమీద ఆత్మ సంబంధమైన ఆయన శరీరంగా ఉంటారు. వారు క్రీస్తు ప్రభువుని అన్ని విషయాల్లో ఘనపరచుతూ ఉంటారు. ఆత్మసంబంధమైన ఈ సంఘటిత శరీరం అవయవాలుగలదై యుంటుంది, ఆత్మ మూలంగా దేవుడు అందులో నివాసం చేస్తాడు. సంఘంలో భాగమైయుండడం లేక సభ్యత్వం కలిగి యుండడమంటే – ఒక గ్రూపులో సభ్యత్వం కలిగియుండడమో లేక కేవలం మానవ సంస్థలో పాలుగలవారై యుండడం మాత్రం కాదు. సన్నిహిత మైనదియు క్రీస్తుతో కొనసాగిపోతూ ఉండే బాంధవ్యమైయుంది.

క్రీస్తు శరీరమైన సంఘము విశ్వాసంతో ప్రవేశించేదైయుంది. ఈ విశ్వాసపు ప్రత్యుత్తరం మారుమనస్సు (అపొ. 17:30, 31), యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనడం (రోమా 10:10), క్రీస్తులోనికి బాప్తిస్మంతో కూడినదైయుంది (రోమా 6:3; గలతీ. 3:27). బాప్తిస్మపు సమయంలో, ఒకని పాపాలు కడిగివేయబడతాయి, మరియు తన క్రొత్త జన్మ యొక్క విధానం పూర్తవుతుంది గనుక, క్రీస్తు ప్రభువు శరీరంలో ఒక భాగంగా అతడు మారతాడు (అపొ. 2:38, 41, 47; 22:16; 1 కొరింథీ. 12:13).

క్రొత్త నిబంధన సంఘము ఒక నామకరణ కూటమి లేక మతశాఖ కాదు. మత శాఖలు మనుష్యులు కల్పించినవి; క్రొత్త నిబంధన సంఘమైతే రూపింపబడినదై, సృజింపబడినదై, ప్రభువునందు నిలిచినదై, ఆయనచే నిలుపబడునదైయుంది.

మతశాఖలు భూలోకంలోనుండి, మానవులలోనుండి వస్తాయి; క్రొత్త నిబంధన సంఘము పరలోకమునుండి, దేవుని యొద్దనుండి వస్తుంది. సంఘము క్రీస్తుకు చెందుతుంది – ఆయన నామాన్ని ధరిస్తుంది, ఆయన తండ్రిని ఆరాధించడానికి కూడుకొంటుంది, ప్రభువు కార్యాలను లోకంలో జరిగిస్తుంది, దేవుని ఆత్మ తనలో నివాసం కలిగియుంటుంది. ("క్రొత్త నిబంధన సంఘము" అనే చార్టును 161వ పేజీలో చూడు.)

రక్షణకు సంబంధించిన షరత్తులపై ప్రజలందరికి తన సంఘంలో ప్రవేశించ డానికిని, ఈ లోకంలో తన సంఘంగా జీవించడానికిని క్రీస్తు ప్రభువుచే ఆహ్వానం లోకంలోని జనులందరికిని అందింపబడుతుంది (ప్రకటన 22:17).

## పరిశీలనకైన ప్రశ్నలు

*(జవాబులు – 252వ పేజీలో)*

1. పరిశుద్ధాత్మ లేఖనాల్లో ఉపయోగిస్తున్న ఒక పదాన్ని, "సంఘము" వంటి పదాన్ని అర్థం చేసుకోడం ఎంతవరకు అవసరం?
2. క్రొత్త నిబంధనలో "సంఘము" అనే పదం ఉపయోగింపబడిన వివిధ విధములను చర్చించు.
3. సంఘము దేవుని ఆలయమైయుంది. నేడు క్రైస్తవుని జీవితంలో దాని భావమేమి? సంఘమునకున్న పేరు – దాని సభ్యులు ఎలా జీవించాలి, పనిచేయాలి, ఆరాధించాలి అనే విషయాలను సూచిస్తుందా?
4. ఏ భావంలో సంఘము సజీవమైన కట్టడమైయుంది?
5. ఏ విధంగా భర్త భార్యలకున్న బాంధవ్యం సంఘానికి క్రీస్తుకు ఉన్న బాంధవ్యాన్ని ఉదహరిస్తుంది?
6. క్రీస్తు సంఘంలోనికి ఒకడు ఎలా ప్రవేశిస్తాడో స్పష్టంగా వర్ణించుము.
7. ఏ భావంగా సంఘము క్రీస్తుకు ఏకైకంగా లేక ప్రత్యేకంగా చెందుతుంది?

## పద సహాయకారి

**మత శాఖ –** (నామకరణ కూటమి) బైబిలుకు సంబంధంకాని పేరుతో, ఒక విధమైన విశ్వాసపు ప్రమాణంతో ఏకమై, ఒక విధమైన నాయకత్వం (కౌన్సిల్)చే నడిపింపబడే మత స్థానిక సంఘాల కూటమి. క్రొత్త నిబంధనలో మత శాఖలు కన్పించవు గనుక, ఇది బైబిలు పదం కాదు.

**సహవాసము –** అభిలాషలు, ఆదర్శాలు లేక ఆలోచనలు లేక అనుభవాలు పంచుకొనడం; క్రైస్తవుల హృదయాలలో ఒకరి పట్ల ఒకరికి ఉండునట్లు నింపబడే ప్రేమ.

**జారత్వము –** లైంగిక పాపము; వివాహం కాకుండ లైగింక బాంధవ్యం కలిగి యుండడం.

---

[1]Ethelbert W. Bullinger, *A Critical Lexicon and Concordance to the English and Greek New Testament* (Grand Rapids, Mich.: Zondervan, 1975), 153. [2]Ibid. "సంఘము" అనే పదము మార్కు, లూకా, యోహాను సువార్తల్లోను, 2 తిమోతి, తీతు, 1, 2 పేతురు, 1, 2 యోహాను లేక యూదాలో ఉపయోగించలేదు. [3]"దేవాలయము" అనేదానికి గ్రీకు భాషలో *naos* అనియు *hieron* అనియు రెండు పదాలున్నాయి. ఈ లేఖన భాగంలో పౌలు ఉపయోగించిన పదం *hieron* కాదు *naos* అనేది పరిశుద్ధ స్థలాన్ని సూచిస్తుందిగాని, *hieron* వలె దేవాలయపు ఆవరణంలోని సమస్తాన్ని సూచించదు. క్రీస్తు శరీరమే దేవుని నివాస స్థలమైయున్నట్టు పౌలు స్థిరపరచుతున్నాడు. [4]ఈ ప్రతిపాదనలో "మీరు" అనే పదం గ్రీకులో మధ్యమ పురుష బహు వచనం, ప్రజల సముదాయం యోచనలో ఉంచబడినట్టు సూచింపబడింది గాని, 1 కొరింథీ. 6:19, 20ల్లో ఉన్నట్టు ఒక వ్యక్తిని అది సూచించడం లేదు.